ప్రజాశక్తి
శనివారం 30 ఆగస్టు 2025 5 అనంతపురం

వినాయక నిమజ్జనంలో వివాదం

చెన్నంపల్లిలో పోలీసుల లాఠీఛార్జి

ప్రజాశక్తి-అనంతపురం

వినాయక నిమజ్జంలో వివాదం చోటు చేసుకుంది. బుక్కరాయసముద్రం మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో దళితులపై పోలీసులు దాడి చేసిన ఘటన చోటు చేసుకుంది. చెన్నంపల్లి గ్రామంలో గతేడాది వివాదం చోటు చేసుకోవడంతో ఈ ఏడాది పండుగ జరుపుకోవడానికి పోలీసులు అనుమతివ్వలేదు. దళితులు ఈసారి తమ వాడలోని దేవాలయంలో విగ్రహం ఏర్పాటు చేసుకున్నారు. ఈ విగ్రహాన్ని మూడవ రోజు అయిన శుక్రవారం మధ్యాహ్నం నిమజ్జనం కోసమని తీసుకెళుతున్నారు. ఈ సమయంలో పోలీసులు అక్కడికి చేరుకుని అనుమతిలేకుండా విగ్రహం ఏర్పాటు చేయడమే కాకుండా నిమజ్జనం ఊరేగింపుగా తీసుకెళ్లడానికి వీల్లేదని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో నిమజ్జనం చేస్తున్న దళితకాలనీకి చెందిన వారికి పోలీసుల మధ్య వాగ్వివాదం జరిగింది. పోలీసులను అడ్డుకున్నారన్న కోపంతో వారి ఇళ్లలోకి చొరబడి పోలీసులు దళితులపై దాడి చేశారు. ఈ దాడుల్లో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి.

శింగనమల 'తమ్ముళ్ల' మధ్య ఆరని చిచ్చు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

శింగనమల నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్ల మధ్య విభేదాలు వీడటం లేదు. ఎమ్మెల్యే వర్సస్ టుమెన్ కమిటీ అన్నట్టుగా నడుస్తోంది. నియోజకవర్గం మొత్తం రెండు గ్రూపులుగా క్యాడర్ విడిపోయింది. ఒకరంటే ఒకరికి గిట్టని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రతి విషయంలోనూ పరస్పరం ఘర్షణకు దిగుతున్నారు. నేతల మధ్య విభేదాలు అనేకసార్లు రచ్చకెక్కినా అధిష్టానం వాటికి పుల్‌స్టాప్ పెట్టించలేకపోతోంది. ఇప్పుడు వరుసగా ఈ రచ్చలు రోడ్డుకెక్కుతున్నాయి. శుక్రవారం బుక్కరాయసముద్రం ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసనకు దిగారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరో గ్రూపు ఎమ్మెల్యేకు మద్దతుగా టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇలా ప్రతి విషయంలోనూ ఆ నియోజకవర్గంలో రెండు గ్రూపుల మధ్య వివాదాలు చోటు చేసుకుంటూనే ఉన్నాయి. కొన్ని రోజుల క్రితం రెడ్డిపల్లి గ్రామం వద్దకూడా ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టు కోసం రోడ్డు ఎక్కి కొట్టుకున్నారు. గార్లదిన్నె మండలంలోని కనుంపల్లి గ్రామంలో ఇదే రకంగా రెండు గ్రూపుల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడమే కాకుండా పరస్పరం దాడులు చేసుకున్నారు. ఇలా వరుసగా ఈ నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకుంటున్నాయి. చివరకు పార్టీ కమిటీల ఏర్పాటులోనూ ఈ వివాదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. నేతల మధ్య సఖ్యత కుదరక కమిటీల ఏర్పాటు కూడా సక్రమంగా జరగలేదు. జిల్లా ఇంఛార్జ్ మంత్రి టిజి.భరత్ ఎదుట కూడా నేతలు ఘర్షణ పడ్డారు. పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. తమ వారికి ప్రాధాన్యత కల్పించడం లేదంటే, తమ వారికి కల్పించడం లేదంటూ రెండు గ్రూపుల మధ్య వివాదం నడుస్తూనే ఉంది. వీటి నడుమ రేషన్ డీలర్ల మార్పు, ఫీల్డ్ అసిస్టెంట్ల మార్పులు చేయాలని భావించినా అవి జరగలేదు. ఇప్పుడు ఈ మార్పుల కోసం ప్రయత్నించే వారు రోడ్డుకెక్కుతున్నారు. వీటిని సమన్వయం చేయడంలో అధిష్టానం తీసుకుంటున్న చర్యలు ఫలించడం లేదు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్నాయి. వీటిల్లో ఈ గ్రూపుల మధ్య తగాదాలు ఇంకెంతకు చేరుతాయన్నది ఆ పార్టీ శ్రేణుల్లో గుబులు రేపుతోంది. నియోజకవర్గంలో టిడిపి బలంగా ఉన్నప్పటికీ నేతల మధ్య విభేదాలు రోజురోజుకు ఎక్కువ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ పట్టు సడలే పరిస్థితి నెలకొంటోందని ఆందోళన ఆ పార్టీ శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. గత స్థానిక సంస్థల్లో జిల్లాలో అనేక చోట్ల టిడిపి ఓటమి చెందినప్పటికీ శింగనమల నియోజకవర్గంలో కొంత వరకు మంచి ఫలితాలనే పార్టీ సాధించింది. ఈసారి జరిగే ఎన్నికల్లో అధికారం కూడా ఉండటంతో మరింతగా పార్టీ గెలుపునకు అవకాశాలున్నప్పటికీ నేతల మధ్య సఖ్యత లేక నష్టపోయే పరిస్థితి ఎదురవుతుందన్న చర్చ ఆపార్టీ వర్గాల్లో నడుస్తోంది.

ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళన

కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ కార్యకర్త
ఫీల్డ్ అసిస్టెంట్ నియామకంపై ఎమ్మెల్యే తీరును తప్పుపట్టిన వైనం
పార్టీ జిల్లా అధ్యక్షుడికి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే వర్గం

ప్రజాశక్తి - బుక్కరాయసముద్రం

ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకంలో స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఏకపక్షంగా వ్యవహరిస్తుందని విమర్శిస్తూ ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. టూమెన్ కమిటీ నాయకులు ఆధ్వర్యంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఉదయం స్థానిక అనంతపురం - తాడిపత్రి జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. ఓ కార్యకర్త తన ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. సకాలంలో పోలీసులు, నాయకులు స్పందించి అడ్డుకున్నారు. ఈసందర్భంగా టిడిపి మండల కన్వీనర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ బుక్కరాయసముద్రం మండలంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పోస్టులను లక్షలాది రూపాయలకు అమ్ముకున్నారని ఆరోపించారు. క్రమ శిక్షణ చర్యల్లో భాగంగా గతంలో తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లలో ఒక్కరిని తిరిగి నియమించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో వైసిపి ప్రభుత్వ హయాంలోనూ, ఎన్నికల సమయంలోనూ పార్టీ అభివృద్ధి కోసం పనిచేసిన వారిని స్థానిక ఎమ్మెల్యే విస్మరించి అవమానపర్చుతోందన్నారు. ఉపాధి హామీలో అవినీతి జరిగిందని, ఈ విషయంలో క్రమశిక్షణ పాటించని ఐదుగురు ఫీల్డ్ అసిస్టెంట్లను ఎమ్మెల్యే, ఎంపీ ఆధ్వర్యంలో తొలగించారని తిరిగి వారిలో ఒకరిని ఫీల్డ్ అసిస్టెంట్లుగా నియమిస్తూ సర్క్యులర్ విడుదల చేయడం బాధాకరమని అన్నారు. నియమించిన ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా అక్కడున్న నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే డౌన్ డౌన్.. ఎంపీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో స్థానిక సిఐ పుల్లయ్య సమాచారంతో అనంతపురం నుంచి స్పెషల్ పార్టీ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఎంపీడీవో సాల్మన్ ఆందోళనకారుల వద్దకు వచ్చి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అయినప్పటికీ నిరసన కారులు తమ ఆందోళన కొనసాగించారు. పీడీ ఇక్కడికి రావాలని, ఎమ్మెల్యే రావాలని పట్టుపట్టారు. చివరకు ఎపిడి శ్రీనివాసులు అక్కడికి చేరుకుని నాయకులతో మాట్లాడారు. ఇక్కడి విషయాలను ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళనకారులు నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో సింగల్ విండో అధ్యక్షులు కేసన్న, మాజీ సర్పంచి లక్ష్మీనారాయణ, ఎస్ నారాయణస్వామి, బుక్కరాయసముద్రం పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఎంపిడిఒ కార్యాలయం వద్ద నెలకొన్న ఉద్రిక్తత

టిడిపి జిల్లా అధ్యక్షుడికి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యే వర్గం

రాజకీయ ప్రయోజనాలు పొంది కూడా ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణపై అరోపణలు చేయడం సరికాదని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అనుకూల వర్గం నాయకులు టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా నాయకులు దండువారిపల్లి ఆదినారాయణ, ఓబుళపతి, పొడరాళ్ల రవీంద్ర జొన్న రామయ్య, కేకే అగ్రహారం రాము, బాబా ఫక్రుద్దీన్ తదితరులు మాట్లాడుతూ కొందరు నాయకులు తల్లిపాలు తాగి రొమ్ము తన్నిన విధంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాలు పొంది కూడా ఎమ్మెల్యే శ్రావణిశ్రీ, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. పార్టీ అధికారం రావడానికి నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్త కష్టపడ్డారని గుర్తుచేశారు. సమస్యలు ఉంటే పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని, కానీ పార్టీ జెండాలు పట్టుకొని ధర్నాలు చేయడం తగదని హెచ్చరించారు. ఒక మహిళ ఎమ్మెల్యే అని చూడకుండా నోటికొచ్చినట్లు మాట్లాడడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. పార్టీ ప్రయోజనాల దృష్ట్యా మౌనంగా ఉన్న ప్రజాప్రతినిధులపై ఇలా అనునిత్యం ఏదో ఒక సాకుతో పార్టీకి కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తేవడం మంచిది కాదని అన్నారు. స్పందించిన జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ మాట్లాడుతూ 'పార్టీ లైన్ దాటితే ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. అలాంటి వారిపై చర్యలుంటాయన్నారు. ఒక ఫీల్డ్ అసిస్టెంట్ విషయంలోనే పదేపదే సమస్యలు వస్తున్నాయన్నారు. పార్టీ పెద్దలతో మాట్లాడి త్వరలోనే సమస్యకు పరిష్కారం చూపుతామన్నారు.

విలేకర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వర్గం నాయకులు

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

టాప్-6లో జిల్లా ఉండాలి

అన్న క్యాంటీన్లు, పరిశుభ్రతపై దృష్టి పెట్టాలి
అధిక ధరకు యూరియా విక్రయిస్తే చర్యలు తీసుకోవాలి
వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం

అన్న క్యాంటీన్ల నిర్వహణ, మున్సిపాలిటీల్లో పరిశుభ్రత, ఇతర అంశాల్లో రాష్ట్రంలోని జిల్లాను టాప్-6లో నిలిపేందుకు అధికారులు పని చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి పెన్షన్లు, అన్న క్యాంటీన్లు, మున్సిపాలిటీల్లో శానిటేషన్, ఇరిగేషన్, ఐసిడిఎస్, యూరియా, విద్యుత్ శాఖ, ఏపీఐఐసి భూ సమస్యలు, తదితర అంశాలపై జిల్లా అధికారులు, ఆర్డీఓలు, తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ, ఐసిడిఎస్, తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్న క్యాంటీన్ల అమలులో రాష్ట్రంలో జిల్లా 4వ స్థానంలో నిలవడంపై కమిషనర్లకు అభినందనలు తెలిపారు. అయితే పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, నాణ్యత మరింత పెంచాలన్నారు. సానుకూల ప్రజా అవగాహనకు సంబంధించి మున్సిపల్ సేవల పరిధిలో రోజు ఇంటి నుంచి చెత్తను సేకరిస్తున్నారా, మీ పరిధిలో చెత్తకుప్పలను 24 గంటలలోపు తొలగిస్తున్నారా లేదా, మున్సిపాలిటీలో డ్రెయినేజీలు పరిశుభ్రం చేస్తున్నారా అన్న అంశాలకు సంబంధించి మరింత పురోగతి చూపించాలని, పరిశుభ్రతపై మున్సిపల్ కమిషనర్లు పరిశీలన చేయాలన్నారు. రోజు ఇంటి నుంచి చెత్త సేకరించాలని, డ్రైనేజీలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. 1వతేదీన పెన్షన్ల పంపిణీకి సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 304 మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు ఉండగా, ప్రతి చెరువులకు నీరు నింపేలా, భూగర్భజలం పెంచేలా కార్యచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. వచ్చేవారం రోజుల్లో 50 చెరువులకు నీరు నింపేలా చూడాలని మైనర్ ఇరిగేషన్ ఎస్ఈని ఆదేశించారు. జిల్లాలో ఎరువుల కొరత లేదన్నారు. రైతు సేవాకేంద్రాలు, డిసిఎంఎస్‌ల్లో అవసరమైన చోట ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. రైతు సేవ కేంద్రాలలో, ప్రైవేట్ చోట ఎరువుల అమ్మకాలపై విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు మానిటర్ చేయాలన్నారు. ఇకపోతే జిల్లాలో 21 సబ్‌స్టేషన్లు ఉండగా, వాటి చుట్టూ భూమి తీసుకుని సోలార్ ప్లాంట్లు పెట్టి గ్రీన్ ఎనర్జీని జనరేట్ చేయాలన్నారు. ఇందుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గుంతకల్లు, శింగనమల, రాయదుర్గం నియోజకవర్గాలలో ఎంఎస్ఎంఈ పార్కుల కోసం ఒక్కోచోట 50 ఎకరాల భూమిని గుర్తించాలని ఆయా తహశీల్దార్లను ఆదేశించారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి అనంతపురం సిటీ

జిల్లాలో డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం కొనసాగింది. అభ్యర్థుల సర్టిఫి కెట్ల పరిశీలన పారదర్శకంగా సాగుతోందని డీఈవో ప్రసాద్‌బాబు తెలిపారు. అయితే రాష్ట్ర వ్యాప్తంగా డీఎస్సీ స్పోర్ట్స్ కోటాలో, వికలాంగుల కోటాలో కానీ నకిలీలు ఉన్నట్లు వదంతులు వస్తున్నా యని జిల్లాలో ఇంతవరకు ఇలాంటివి జరగలేదని అన్నారు. ఒకవేళ అలాంటివి వస్తే విచారణకు పం పిస్తామన్నారు. కొంతమంది శారీరక వికలత్వం క లిగిన వారు మెడికల్ బోర్డుకు వెళ్లారన్నారు. వీరిలో ఆరుగురు కర్నూల్‌కు వెళ్లారని వారు అక్కడ నుండి వచ్చిన తర్వాత వారి సర్టిఫికెట్లను పరిశీలిస్తామని చెప్పారు. శుక్రవారం వరకు నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనలో భాగంగా ఇంతవరకు 807 మంది సర్టిఫికెట్లను పరిశీలించాల్సి ఉండగా 9 మంది మాత్రమే గైర్హాజరయ్యారని చెప్పారు. వారికి ఫోన్ ద్వారా కూడా తెలియజేశామని శనివారం వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

పంచాయతీరాజ్ కార్యాలయం వద్ద విభాగిని వద్ద బస్సును ఇబ్బందికరంగా తిప్పుతున్న ఆర్టీసీ డ్రైవర్

'సుందరీకరణ'తోనైనా

అవస్థలు తప్పేనా..?

నిత్యకృత్యమవుతున్న ట్రాఫిక్
ఇరుగ్గా 'విభాగిని'లు
మార్కెట్‌కు వెళ్లాలంటే ఎదురు వెళ్లాల్సిందే..
ఇదీ రాయదుర్గంలో పరిస్థితి

ప్రజాశక్తి-రాయదుర్గమ్మ రూరల్

రాయదుర్గంలో రోజురోజుకూ వాహనాల రద్దీ పెరుగుతోంది. 2018లో గ్రామీణ గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ప్రస్తుత ఎమ్మెల్యే, విప్, కాలవ శ్రీనివాసులు ఉన్న సమయంలో రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా పట్టణంలోని అనంతపురం రోడ్డులో ఉన్న రహదారులు, భవనాల శాఖ విశ్రాంతి గృహం నుంచి మొల్కలమూరు రోడ్డు వరకూ విస్తరణ పనులు చేపట్టారు. నానాటికీ పెరుగుతున్న పట్టణ జనాభాతోపాటు వాహనాల సంఖ్య కూడా ఎక్కువ అవుతోంది. చాలా ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన బైపాస్ రోడ్డులో రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నీరు నిల్వ ఉండి గుంతలు పడి అధ్వానంగా తయారైంది. నెలల తరబడి అండర్ బ్రిడ్జ వద్ద వర్షం నీరు నిల్వ ఉంటున్నాయి. విషయం తెలియని భారీ వాహనాల డ్రైవర్లు ఆ దారి గుండా వచ్చి వాహనాలు ఇరుక్కుని అవస్థలు పడటంతోపాటు సరుకు నీటిలో తడిచిపోవడంతో నష్టపోయిన ఘటనలు అనేకంగా ఉన్నాయి. కర్ణాటకలోని హనగల్ క్రాస్ నుంచి రాయదుర్గం మీదుగా అనంతపురం దాకా జాతీయ రహదారి 544 డి.డి ఏర్పడింది. ఈ రహదారిని రాయదుర్గంలోకి రాకుండా శివారు ప్రాంతం గుండా వెళ్లేలా నిర్మించారు. కోతి గుట్ట వెనకవైపు నుండి జెఆర్‌ఎస్ కాలనీ మధ్య ఉన్న రైల్వే వంతెన బిగించే పనులు జరగకపోవడంతో జాతీయ రహదారి అనుసంధానం లేకుండాపోయింది. దీంతో ఇటు కర్ణాటకలోని మొల్కలమూరువైపు, అనంతపురం వైపు నుంచి వచ్చే వాహనాలన్నీ రాయదుర్గం మీదుగానే రావాల్సి ఉంది. దీనికితోడు ఉరవకొండ వైపు నుండి, బళ్లారి, పరిసర ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు మొల్కలమూరు రోడ్డుకు వైపునకు ప్రయాణించాలంటే పట్టణంలోకి తప్పనిసరిగా రావాల్సిన పరిస్థితి ఉంది. దీంతో భారీగా ట్రాఫిక్ ఉంటుంది. పట్టణంలో అప్పట్లో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు వివిధ శాఖల అధికారుల సమన్వయ లోపం, అవగాహన రాహిత్యం కారణంగా ఇప్పటికీ వాహన చోదకులు, పాదాచారులు అవస్థలు పడుతున్నారు. రోజువారీగా తిరిగే బస్సు డ్రైవర్ల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంది. ఉరవకొండ నుండి వచ్చే బస్సులు రాయదుర్గం పట్టణంలోని రాణి సత్రం బస్టాండ్‌కు వెళ్లాల్సి ఉంటుంది. లక్ష్మీ బజార్లోని పంచాయతీరాజ్ కార్యాలయం గేటు ఎదురుగా మలుపు తిరగాల్సి ఉంటుంది. బస్సు, లారీలు పూర్తిస్థాయిలో వెళ్లేందుకు వీలు లేకుండా అప్పట్లో విభాగినిలు నిర్మించారు. పంచాయత్ రాజ్ కార్యాలయం గేటుకు అనుకుని ఎస్సీ కార్పొరేషన్ వాణిజ్య సముదాయం ఉంది. ఇండేన్ గ్యాస్ ఆఫీస్‌తో పాటు ఇతర దుకాణాలు, బ్యాంకు ఉండడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఈ మలుపులో బస్సులు పూర్తిస్థాయిలో తిప్పేందుకు, అక్కడ పార్కింగ్‌లో ఉన్న వాహనాలను తప్పించేందుకు డ్రైవర్లు అవస్థలు పడుతుంటారు. 2022లో గర్ల్స్ హై స్కూల్ దాటాక లక్ష్మీబజార్ వరకు ఉన్న వాణిజ్య దుకాణాల్లోకి వర్షం నీరు చేరి దుకాణదారులు నష్టపోయారు. ఈ ప్రాంతమంతా వర్షం నీటితో ముంపునకు గురైన విషయం తెలిసిందే. వర్షం నీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా పలువురు దుకాణాల ముందున్న కాలువలను మూసివేశారు. దీంతో వర్షం నీరు రోడ్డుపై నిండి దుకాణాల్లోకి చేరాయి. బళ్లారి రోడ్డు నుంచి మొల్కలమూరు రోడ్డు కు వెళ్లాలంటే వినాయక సర్కిల్ వద్ద ఇరుకు రోడ్లను దాటేందుకు ఇబ్బంది పడుతున్నారు. వినాయక సర్కిల్లో ఉన్న విభాగిని వాహనాల మలుపు తిప్పుకునేందుకు అడ్డుగా ఉంది. దీంతో భారీ వాహనాల వెంట పలు వాహనాలు నిలిచిపోతున్నాయి. కూరగాయల మార్కెట్‌కు వెళ్లేందుకు దారి వదలకుండా విభాగినిలు నిర్మించడంతో వన్‌వే దారి గుండా వస్తున్న వాహనాలకు అభిముఖంగా వాహనదారులు, పాదాచారులు వెళ్లేందుకు తంటాలు పడుతున్నారు. దీంతో కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు జరిగాయి. తాజాగా పట్టణ సుందరీకరణ పనులు చేసేందుకు రూ.7.50 లక్షల నిధులు మంజూరయ్యాయి. విభాగినిల మధ్య ఉన్న మట్టిని తొలగిస్తున్నారు. రాజమండ్రి సమీపంలోని కడియం నర్సరీల నుంచి మొక్కలు తెప్పించి విభాగినిల మధ్య వేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో మట్టిలో మొక్కలు వేసిన మాదిరి కాకుండా ఎరువులతో పాటు మొక్కలు వేసి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రద్దీ మార్గాల్లో నడకదారి, ఇరుకుగా ఉన్న మలుపుల్లో విభాగిని లను తొలగించి సౌకర్యవంతంగా ప్రధాన రహదారి మార్గాన్ని ఏర్పాటు చేస్తే ప్రయోజన కరంగా ఉంటుంది. కాలువల్లో మురుగునీరు, వర్షపు నీరు వెళ్లే మార్గం సుగమం చేయాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది.

కూరగాయల మార్కెట్ వైపు వన్ వేలో ఎదురుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాలు

రాకపోకలకు వీలుగా విభాగినిలు తొలగిస్తాం
- మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి

పిఆర్ కార్యాలయం, వినాయక సర్కిల్ వద్ద వాహనాలు వెళ్లేందుకు వీలుగా విభాగినిలను కొంతమేర తొలగిస్తాం. కూరగాయల మార్కెట్ కు వెళ్లే మార్గంలో నడకదారి, మధు టాకీస్, ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ సమీపంలో ఇనుము విభాగిని లు ఏర్పాటు చేస్తాం.

కౌన్సిల్ మీట్‌లో ఛైర్‌పర్సన్ కంటతడి

అధికారుల నిర్లక్ష్యంతో తాను మాటపడాల్సి వస్తోందని ఆవేదన

ప్రజాశక్తి - గుంతకల్లు

కంటతడి పెట్టుకుంటున్న ఛైర్‌పర్సన్

ఛైర్‌పర్సన్ అసమర్థత వల్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దీంతో పట్టణంలో అభివృద్ధి పడకేసిందని కోఆప్షన్ సభ్యులు వ్యాఖ్యానించడంతో మనస్థాపానికి గురైన ఛైర్‌పర్సన్ భవాని కౌన్సిల్‌మీట్‌లో కంటతడి పెట్టారు. శుక్రవారం స్థానిక కౌన్సిల్ హాలులో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవాని అధ్యక్షతన సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలువురు సభ్యులు అధికారుల తీరుపై మండిపడ్డారు. వైసిపి కౌన్సిలర్ లింగన్న మాట్లాడుత తన వార్డులో అభివృద్ధి పనులు జరుగలేదని, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద సుమారు రూ. 50 లక్షలు విలువ గల రెండు మోటార్లు చోరీకి గురైతే కేవలం 50 వేలు విలువ గలవని పోలీసులకు ఫిర్యాదు చేయడం ఏమిటని కమిషనర్ నయీమ్ అహ్మద్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా ఇతర కౌన్సిలర్లు కూడా తమతమ వార్డుల్లో శానిటేషన్ సక్రమంగా జరగడం లేదని కమిషనర్ పై మండిపడ్డారు.ఈ సమయంలో కో ఆప్షన్ సభ్యులు మహబూబ్‌బాషా మాట్లాడుతూ ఛైర్‌పర్సన్ అసమర్థత వల్లనే అధికారులు సక్రమంగా పనిచేయడం లేదని వ్యాఖ్యానించారు. అందుకు మనస్థాపానికి గురైన ఛైర్‌పర్సన్ సమావేశంలోనే కంటనీరు పెట్టుకున్నారు. అధికారులు తమ విధి నిర్వహణలో అలసత్వంగా ఉండటం వల్లనే తాను మాటపడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇక్కడ పని చేసిన కమిషనర్లు పట్టణ అభివృద్ధికి కట్టుబడి పని చేశారని ప్రస్తుత కమిషనర్ ఉత్సహ విగ్రహంలా ఉన్నారని కౌన్సిలర్ రామగౌని పవన్ కుమార్ గౌడ్ అసహనం వ్యక్తం చేశారు. సమావేశంలో సభ్యులు అడిగిన సమస్యలను పరిష్కారం చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారని మెజారిటీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కల బెడదను నివారించాలని గత నాలుగేళ్లుగా అడుగుతున్నా ఏమి చేశారని ప్రశ్నించారు.అనంతరం అజెండాను ఆమోదిస్తున్నామని చెప్పడంతో ఛైర్‌పర్సన్ సమావేశాన్ని ముగిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎంఇ ఇంతియాజ్ అలీ, మెప్మా ప్రాజెక్టు అధికారి మోహన్, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు,ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం అనంతపురంలోని జెఎన్‌టియు పరిపాలన భవనంలో తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విసి హెచ్.సుదర్శనరావు

ఐఐటి ఎన్ఐటికి సూరేపల్లి విద్యార్థి ఎంపిక

సిఎం అభినందనలు

రామ్‌చరణ్‌ను అభినందిస్తున్న సిఎం చంద్రబాబు

పుట్లూరు : మండలంలోని సూరేపల్లి గ్రామానికి చెందిన కొత్తకోట రామ్‌చరణ్ జెఇఇ మెయిన్స్‌లో ఉతీర్ణత సాధించి ఐఐటి ఎన్ఐటిలో సీట్ సాధించాడు. దీంతో అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును విద్యార్థి మర్యాద పూర్వకంగా కలిశారు. పేదరికం నుంచి వచ్చి ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థిని సిఎం అభినందించారు. రామ్‌చరణ్ మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సిఎం ఆకాంక్షించారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నల్లాని రాజేశ్వరి, విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి అని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు కొనియాడారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జెఎన్‌టియు పరిపాలన భవనంలో గిడుగు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకుంటామన్నారు. గిడుగు రామమూర్తి గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకొచ్చారన్నారు. నిత్య వ్యవహారంలోని భాషలో ఉన్న అందాన్నీ, సౌకర్యాన్ని తెలియజేసిన గొప్ప మహనీయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో ఒఎస్‌డి వీసీ ఎన్. దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు పిఆర్ భానుమూర్తి, ఎస్‌వి సత్యనారాయణ, పి.సుజాత, వైశాలి ఘోర్పడే, నాగప్రసాద్‌నాయుడు, బి.దుర్గాప్రసాద్, జివి సుబ్బారెడ్డి, బి.ఈశ్వర్‌రెడ్డి, ఆర్.కిరణ్మయి, పద్మసువర్ణ, సి.శోభాబిందు, టి.నారాయణరెడ్డి, ఎపి శివకుమార్, ఎం.అంకారావు, శ్రీధర్, పిఆర్ఒ బి ఓంప్రకాష్, అజిత, మాజీ ఆచార్యులు వి.శంకర్, తదితరులు పాల్గొన్నారు.

అనంతపురం : ఇటికలపల్లి సమీపంలో ఉన్న అనంతలక్ష్మి పాఠశాలలో మాతృభాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలు తెలుగుతల్లి, శ్రీకృష్ణదేవరాయలు, వివిధ కవుల వేషధారణలో విద్యార్థులు అలరించారు. అనంతరం తెలుగు భాషలో పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ అనంత రాముడు, వైస్‌ఛైర్మన్ రమేష్ నాయుడు, సిఎఒ నరసింహారావు, ప్రధానోపాధ్యాయురాలు శాలిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనంతపురం సిటీ : తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతుల సేవలు స్ఫూర్తిదాయకమని 'రాజ్యమహిళా సమ్మాన్' అవార్డు గ్రహీత నల్లాని రాజేశ్వరి అన్నారు. గిడుగు జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం అనంతపురంలోని తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో ఎపి గ్రంథాలయ పరిషత్ పూర్వ సభ్యులు, శ్రీశ్రీ కళావేదిక రాష్ట్ర అధ్యక్షులు గుత్తా హరిసర్వోత్తమ నాయుడు, ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సి.సరిత, తెలుగు శాఖ అధ్యక్షులు నగరూరు రసూల్, వి.ఫిరోజా, ఎన్ఎస్ఎస్ పీవోస్ బాబా ఫక్రుద్దీన్, భార్గవి, సురేంద్ర, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల : మండల కేంద్రంలోని స్థానిక జూనియర్ కళాశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బాలప్ప తెలుగు భాష ప్రాముఖ్యత, నైపుణ్యత, తియ్యదనాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు అధ్యాపకులు రంగారెడ్డి, సీనియర్ అధ్యాపకులు లక్ష్మీరంగయ్య, బాబా మైనొద్దీన్, ఖాజాబీ, శివారెడ్డి, జ్యోతి, రవి, పాండురంగ, వీరేష్ అధ్యాపకేతర సిబ్బంది భారతి విద్యార్థులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా, తెలుగు భాష దినోత్సవ వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటప్రసాద్, ఎస్ఐ శివ, ఎంఇఒ హరికృష్ణ, ట్రైనీ ఎస్ఐ జి.మహేష్, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయురాలు సరిత, పాఠశాల కమిటీ ఛైర్మన్ రుద్రయ్య గోపాల్‌రెడ్డి, పీడీలు సరిత, నాగరాజు, సంజీవ్‌కుమార్, గోవిందరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అలాగే స్థానిక శ్రీనివాస విద్యా నికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయులు పర్వతన్న అధ్యక్షతన శుక్రవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా తెలుగు భాష వ్యవహారిక పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ వి.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

కుందుర్పి : మండలంలోని అప్పిలేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బీసీ తిమ్మప్ప ఆధ్వర్యంలో తెలుగు భాషా, క్రీడల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కమిటీ వైస్‌ఛైర్మన్ పద్మక్క, ఉపాధ్యాయులు లక్ష్మన్న, జయశ్రీ, సుగుణ, నళిని, అనసూయ, జయలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

బెలుగుప్పలో నిర్వహించిన తెలుగుభాషా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, అతిథులు

రాయదుర్గం రూరల్ : తెలుగు భాష మాధుర్యం గొప్పదని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం స్థానిక కళాశాలలో మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు జ్ఞానేశ్వర్, తెలుగు అధ్యాపకులు రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం రూరల్ : స్థానిక జ్ఞాన భారతి విద్యాసంస్థల అధినేత రమేష్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే కోర్టు ఆవరణలో ఉన్న తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు.

ఉరవకొండ : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తెలుగు భాషాభివృద్ధికి కృషి చేసిన గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అదేవిధంగా తెలుగులో వంద మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు కూడా బహుమలు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు బి.లక్ష్మీనారాయణ, కార్యదర్శి కె.వేదమూర్తి, ఆర్‌సి గణేష్‌బాబు, సభ్యులు వై.ప్రభాకర్‌నాయుడు, సి.నాగేశ్వరరావు, నూర్‌మహమ్మద్, జికె శ్రీధర్, బి.జయప్రకాష్, ఇ.శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం వద్ద అధికారులు

చెత్త సంపద కేంద్రం పరిశీలన

పుట్లూరు : మండల కేంద్రంలోని చెత్త సంపద కేంద్రాన్ని అకాడమి ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్ విభాగం బృందం సభ్యులు రామచంద్ర శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా చెత్త సంపద కేంద్రం వివరాలను స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ అలివేలమ్మ, పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శక్తి, ఎంఆర్‌సి, గ్రీన్‌గార్డ్, క్లాప్‌మిత్రలు పాల్గొన్నారు.

పిఇటిగా పవన్‌కుమార్

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎపి మోడల్ స్కూల్‌లో టీచర్‌గా పని చేస్తున్న పవన్‌కుమార్ ఇటీవల విడుదలైన డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. మండలంలోని కందికాపుల గ్రామానికి చెందిన రంగనాయకులు, నారాయణమ్మ కుమారుడు పవన్‌కుమార్ పుట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బీసీ హాస్టల్‌లో ఉంటూ విద్యను అభ్యసించారు. అనంతరం ఆదర్శ పాఠశాలలో కాంట్రాక్ట్ పద్ధతిన ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఈ మధ్యకాలంలో విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయుడుగా ఎంపికయ్యాడు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు స్థానికులు పవన్‌కుమార్‌కు అభినందనలు తెలిపారు.

ఇంటింటికీ ఫీవర్ సర్వే

యాడికి : వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేపట్టాలని తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి చిగురుపాటి శ్రీనివాసులు సూచించారు. ఫ్రైడే డ్రైనేను పురస్కరించుకుని శుక్రవారం మండల పరిధిలోని వేములపాడు రోడ్డులో చేపట్టిన ఇంటింటికీ ఫీవర్ సర్వేను పరిశీలించారు. ఇందులో భాగంగా కాలనీలో నీటితొట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఇళ్లలోని నీటితొట్లను వారినికి ఒకసారి శుభ్రం చేసుకుని గంటపాటు ఆరబెట్టుకోవాలన్నారు. అలాగే మురికినీటిపై అబెట్ ఆయిల్ స్ప్రే చేశారు. ఈ కార్యక్రమంలో ఇసిహెచ్ఒ జుబేదా, సూపర్‌వైజర్లు రామ్‌ప్రసాద్‌గౌడ్, శోభారాణి, హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్ స్వర్ణలత, హెల్త్ అసిస్టెంట్ మద్దిలేటి, ఆశా కార్యకర్త మహబూబ్‌బీ, తదితరులు పాల్గొన్నారు.

దొరబాబు సుదర్శకు డాక్టరేట్

అనంతపురం : దొరబాబు సుదర్శకు అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం శుక్రవారం పిహెచ్‌డి డిగ్రీ ప్రదానం చేసినట్లు పరీక్షలు విభాగం డైరెక్టర్ ప్రసాద్‌నాయుడు తెలిపారు. దొరబాబు సుదర్శ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలో డాక్టర్ ఎ.నాగరాజారావు మార్గదర్శకత్వంలో సహ-మార్గదర్శకుడు డాక్టర్ ఎపి శివకుమార్ సహకారంతో 'ఎన్హాన్సింగ్ సెక్యూర్ క్లౌడ్ స్టోరేజ్, షేరింగ్ ఇన్ డైనమిక్ క్లౌడ్ గ్రూప్స్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు పిహెచ్‌డి ప్రదానం చేసినందుకు తెలిపారు. ప్రస్తుతం దొరబాబు గుంటూరులోని కెఎల్ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సిఎస్ఇ విభాగంలో పని చేస్తున్నారు.

బడి పంతులైన గుడిపంతుడి సతీమణి

ఇందిర

గుత్తి : మండలంలోని తొండపాడు గ్రామంలో వెలిసిన బొలికొండ రంగనాథస్వామి గుడిపంతులు సతీమణి ఇందిర బడిపంతులు అయ్యారు. జక్కల చెరువు గ్రామానికి చెందిన ఇందిర ఇటీవల జరిగిన డీఎస్సీ పరీక్షల్లో ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. ఆమె భర్త లిఖిల్ బొలికొండ రంగనాథస్వామి ఆలయంలో అర్చకులుగా పని చేస్తున్నారు. ఆయన భార్య ఇందిర కోచింగ్ కేంద్రంలో శిక్షణ లేకుండా ఇంటి వద్ద చదువుకుని డీఎస్సీ పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉపాధ్యాయురాలిగా సేవలందించనున్నారు. ఉపాధ్యాయురాలు కావడంతో ఇందిరను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. గుడి పంతులు భార్య ప్రస్తుతం పిల్లలకు బడిపంతులుగా మారడం గ్రామానికి గర్వంగా ఉందని పలువురు అంటున్నారు.

బీమా సొమ్ము అందజేత

బీమా చెక్కు అందజేస్తున్న అధికారులు

అనంతపురం : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జిల్లా అగ్నిమాపక ఫైర్‌మెన్ సుధాకర్ కుటుంబ సభ్యులకు శుక్రవారం బీమాకు సంబంధించిన మొత్తాన్ని సంబంధించిన చెక్కు అందజేశారు. సుధాకర్ ప్రమాదంలో మృతిచెందడంతో బ్యాంక్ ఆఫ్ బరోడాకు చెందిన కంపెనీ నుంచి రూ.95లక్షలు మంజూరైంది. దీంతో ఫైర్ సిబ్బంది, బ్యాంకు ప్రతినిధులు బాధిత కుటుంబానికి చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఆఫ్ బరోడా డిజిఎం కెఎస్ ప్రసాద్, ఆర్ఎం పి.అమరనాథ్‌రెడ్డి, మేనేజర్ టి.కిరణ్‌కుమార్, ఉమ్మడి అనంతపురం జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీనివాసరెడ్డి, అసోసియేషన్ సభ్యులు చంద్రశేఖర్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ ఎడ్యుకేషన్ డిఐగా పి.దావూద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

స్కూల్ ఎడ్యుకేషన్ డిప్యూటీ ఇన్స్‌పెక్టర్‌గా పి.దావూద్ శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కె.సర్దార్‌వలి, రాష్ట్ర కౌన్సిలర్ రమణ, నజీర్, కలీం, సొహేల్, నాయకులు మన్సూర్, బషీర్, ఫక్రుద్దీన్, బాబ్జాన్, రఫీక్, అబ్దుల్‌రజాక్, ఇందాదుల్లా, కలీం, ఆర్షద్, కలీం, అయాజ్, అమీనుద్దీన్, ఉమర్, తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

దావూద్‌ను సత్కరిస్తున్న ఎపిటిఎఫ్ నాయకులు

జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

ధ్యాన్‌చంద్‌కు నివాళులర్పిస్తున్న క్రీడాకారులు

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సెంట్రల్ స్కూల్‌లో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో గతేడాది ఎపి స్కూల్ గేమ్స్ రాష్ట్ర,జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు మండల విద్యాశాఖ అధికారులు ఈశ్వరప్ప, రమాదేవి సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో క్రీడా పరికరాలు, జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి, పాఠశాల ఫిజికల్ డైరెక్టర్లు మారుతీప్రసాద్, రాఘవేంద్ర, మంజునాథు, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలోని విజన్ హైస్కూల్లో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా దివంగత మేజర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో విజన్ స్కూల్ విద్యాసంస్థల అధినేత విశ్వనాథ్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నాటుసారా రహిత జిల్లాగా 'అనంత'

కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

నాటసారా రహిత జిల్లాగా అనంతపురం జిల్లాను నిలిపేందుకు అందరం కలిసికట్టుగా పని చేద్దామని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ పరిధిలో 'నవోదయం 2.0'పై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా ఎక్సైజ్ శాఖ రూపొందించిన నవోదయం 2.0, నాటసార నిర్మూలన, కంట్రోల్ రూమ్ నంబర్ 14405, నాటసారాని తరిమికొడదాం, ఆరోగ్యాన్ని కాపాడుకుందాం అనే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 104 గ్రామాలను నాటుసారా రహిత గ్రామాలుగా ప్రకటించినట్లు తెలిపారు. నాటుసారా నిర్మూలనపై ఎప్పటికప్పుడు దాడులు చేయాలన్నారు. ఎక్సైజ్ పోలీస్ అధికారులు కూడా వేగవంతంగా ఆలోచించి నాటుసారాను దూరం పెట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.రామ్మోహన్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రేవతి, ఎక్సైజ్ సీఐలు సత్యనారాయణ, సునీల్, సాగర్, సోమశేఖర్, సునీత, జయనాథ రెడ్డి, ఎస్ఐ జకీర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'పల్లె ఉమ' వర్ధంతి

ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి -అనంతపురం

మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి సతీమణి పల్లె ఉమా వర్ధంతి వేడుకలు శనివారం ఘనంగా జరగనున్నాయి. ఈమేరకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక జాతీయ రహదారి సమీపంలో హైదరాబాద్ చెఫ్స్ ఎదురుగా ఉన్న పల్లె వ్యవసాయ క్షేత్రంలో చేస్తున్న ఏర్పాట్లను మాజీమంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి, బాలాజీ ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ పల్లె కిషోర్, ఎమ్మెల్యే సింధూరారెడ్డి, పివికెకె యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి ఎర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈమేరకు ఉమా ఘాటును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. పివికెకె కళాశాలల నుంచి పల్లె వ్యవసాయ క్షేత్రం వరకూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ముఖ్యంగా పుట్టపర్తి నియోజకవర్గం నుంచి భారీగా టిడిపి శ్రేణులు, అభిమానులు ,పల్లె విద్యాసంస్థల నుంచి విద్యార్థులు ,అధ్యాపకులు తరలిరానున్నారు. అందుకు అనుగుణంగా ఏర్పాటు చేస్తున్నారు.

పల్లె ఉమా వర్ధంతి ఏర్పాట్లను పరిశీలిస్తున్న పివికెకె యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి

డెంగీ నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ప్రస్తుతం ప్రబలుతున్న డెంగీ వ్యాధి నిర్మూలనకు ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా మలేరియా నివారణ అధికారి ఓబులు సూచించారు. మండలంలోని మిడుతూరులో ఓ విద్యార్థికి డెంగీ వ్యాధి నిర్ధారణ కావడంతో శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. ఇందులో భాగంగా విద్యార్థి ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించారు. అక్కడి పరిసరాలు, పరిశుభ్రత తదితర అంశాలపై దృష్టి పెట్టి నీరు నిల్వ ఉండకుండా ఉండేలా దోమలనివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ప్రజల ఆరోగ్యం పట్ల ఎవరూ నిర్లక్ష్యం వహించరాదని అలాచేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గుత్తి మలేరియా నివారణ ఉప యూనిట్ అధికారి ప్రభాకర్, ఆరోగ్య సూపర్‌వైజరు శ్రీనివాసులు, ఆరోగ్య కార్యకర్తలు బాలగంగాధరరెడ్డి, శివప్రసాద్, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం అలవాటు చేసుకోండి

పోటీలను ప్రారంభిస్తున్న వక్తలు

అనంతపురం : విద్యార్థులు రోజూ గంటపాటు వ్యాయామం చేయడం అలవాటు చేసుకోవాలని ఎస్‌వి డిగ్రీ, పిజి కళాశాల వైస్‌ఛైర్మన్ సి.చక్రధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. హాకీ దిగ్గజం ధ్యానంద్ జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం క్రీడాపోటీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఏదో ఓ క్రీడలో భాగస్వామ్యం కావాలన్నారు. యోగా, వ్యాయామం, ఇతర క్రీడలను ఎంచుకుంటే ధృడంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వి ప్రసాద్, ఎఒ శ్రీనాథ్, వ్యాయమ అధ్యాపకులు ఎం.శ్రీనివాసులునాయక్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి సహకరించండి

రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ మునివేలు

బొమ్మనహాల్ : రైతులు విద్యుత్ పోళ్ల ఏర్పాటుకు స్థలం ఇచ్చి ప్రభుత్వానికి సహకరించాలని తహశీల్దార్ మునివేలు కోరారు. శుక్రవారం మండలంలోని ఎలంజి గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ విద్యుత్ ఫోన్‌లు వేయడానికి ఐదుసెంట్లు స్థలం అవసరం ఉందన్నారు. ఇందుకు సంబంధించిన కంపెనీ వారు నష్టపరిహారం కూడా చెల్లిస్తారన్నారు. కావున రైతులు సహకరించి పోళ్లు వేయడానికి 10 మంది రైతులు ఒక్కొక్కరు ఐదుసెంట్ల వంతున ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో యుగంధర్, కంపెనీ సిబ్బంది పాల్గొన్నారు

ఉద్యోగుల ఎంపిక జాబితా విడుదల

అనంతపురం : కలెక్టర్ అనుమతితో జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న శానిటరీ అటెండర్, వాచ్‌మెన్ పోస్టులకు ఎంపికైన వారి జాబితాను శుక్రవారం విడుదల చేసినట్లు డిఎంహెచ్ఒ ఇబి దేవి ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో 18 ఎఫ్ఎన్ఒ, 11 శానిటరీ అటెండర్, వాచ్‌మెన్ పోస్టులకు సంబంధించి అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేసేందుకు ఎఫ్ఎన్ఒ పోస్టులకు 396, శానిటరీ అటెండర్ పోస్టులకు 478 మంది దరఖాస్తు చేసుకోగా అర్హులను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఫైనల్ మెరిట్ జాబితాను ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ www.anantapuramu.ap.gov.inలో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు.

CHANGE OF NAME

ABDUL RAWOOF (old name) son of **MOHAMMED HUSSAIN SAHEB** (old name) my date of birth is **25-08-1955** (old) resident of 9-4-530/789-12, Indhiramma Colony, Opposite Ismail Masjid, Rayadurgam– 515865, Anantapuramu Dist., have changed my name **CONTRACTOR ABDUL RAWOOF** (new name) and my father's name **CONTRACTOR MAHAMMAD HUSSAIN** (new name) and my date of birth is **01/07/1953** (as per Aadhar and Pan card) vide affidavit dated on 26th August, 2025 sworn before Notary by S.Channaveerappa, Advocate, Rayadurg.

అక్రిడిటేషన్ల గడువు పొడిగింపు

ప్రజాశక్తి-అనంతపురం

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలలుపాటు గడువు పొడిగిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో ఆదేశాలు జారీ చేశారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి నవంబర్ 30వతేదీ వరకూ గడువు పొడిగించినట్లు తెలిపారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

ఎంపిడిఒ మమతాదేవి

చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపిడిఒ మమతాదేవి

ప్రజాశక్తి-నార్పల

గ్రామాల్లో ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిడిఒ మమతాదేవి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని నాయనపల్లి, వెంకటాంపల్లి గ్రామాల్లో డిప్యూటీ ఎంపిడిఒ శైలజారాణితో కలిసి పర్యటించారు. ఇందులో భాగంగా ఆయా సచివాలయాల్లోని సిబ్బంది హాజరు పట్టికలు, రికార్డులు, రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల్లో జరుగుతున్న కౌసలం సర్వే, స్వామిత సర్వే, సిటిజన్ వికెవైసిల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వెంకటామపల్లిలో చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున గ్రామీణ ప్రాంత ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన ఉండాలన్నారు. ముఖ్యంగా వర్షం నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. అదేవిధంగా గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రతతో పాటు పొడి, తడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అందరికీ పింఛన్లు

మండల వ్యాప్తంగా రీ వెరిఫికేషన్‌లో తొలగించిన లబ్ధిదారులకు కూడా పింఛన్లను యథాతథంగా పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే నోటీసులు అందుకున్న పింఛన్‌దారులు ఎంపిడిఒ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఉనికి కోసమే 'రంగయ్య' విమర్శలు

టిడిపి సీనియర్ నాయకులు

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య రాజకీయ ఉనికి కోసం లేనిపోని విమర్శలు చేస్తున్నారని టిడిపి సీనియర్ నాయకులు అన్నారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం ప్రజావేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి నాయకులు మాట్లాడుతూ టిడిపిని విమర్శించే నైతిక హక్కు వైసిపికి, రంగయ్యకు లేదన్నారు. పనులు చేసే చోట పరిశీలిస్తే పనులు కనిపిస్తాయన్నారు. కేవలం రాజకీయంగా తన ఉనికిని కాపాడుకునేందుకే రంగయ్య ఇలాంటి చవకబారు మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇలాంటివి మాట్లాడితే గ్రామాల్లో తిరగకుండా ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు చౌలం మల్లికార్జున, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వైపి రమేష్, మార్కెట్ యార్డు ఛైర్మన్ గోళ్ల లక్ష్మీదేవిరమేష్, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ పాపంపల్లి రామాంజనేయులు, మండల అధ్యక్షులు ధనుంజయ, పాలబండ్ల శ్రీరాములు, శివన్న, గోళ్ల వెంకటేషులు, టీఆర్ తిప్పేస్వామి, శర్మస్‌వలి, మాజీ లిడ్‌క్యాప్ డైరెక్టర్ ఆవుల తిప్పేస్వామి, మాజీ సర్పంచు గాజుల శ్రీరాములు, సింగిల్‌విండో అధ్యక్షుడు మల్లిపల్లి నారాయణ, దండా వెంకటేషులు, రామరాజు, డిష్ మురళి, మాజీ జడ్పీటీసీలు గురుప్రసాద్, కొల్లాపురప్ప, నగేష్, షామీర్, సర్పంచులు కుమార్, లాల్‌కృష్ణ, బొజ్జన్న, వెట్టి హనుమంతురాయుడు శ్రీనివాసులు, సునీల్ పాల్గొన్నారు.

వైసిపి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా పట్నం ఫణీంద్ర

నార్పల : నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన పట్నం ఫణీంద్ర నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఫణీంద్ర మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన జిల్లా అధ్యక్షులు అనంత వెంకట్రామిరెడ్డి, సమన్వయకర్త సాకే శైలజానాథ్, రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి, మండలాల కన్వీనర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా బీసీలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుమ్మఘట్ట : మండల పరిధిలోని కోనాపురం వద్ద ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఆంజనేయులుకు తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. తాళ్లకెర గ్రామానికి చెందిన ఆంజనేయులు పని నిమిత్తం గుమ్మఘట్టకు వస్తుండగా కోనాపురం క్రాస్ వద్దకు రాగానే ఎదురుగా కోనాపురానికి చెందిన ట్రాక్టర్ వచ్చి ఢీకొంది. దీంతో గాయాలపాలైన ఆంజనేయులును గుమ్మఘట్ట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అరంతరం మెరుగైన వైద్యం కోసం 108లో రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.